

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది: రుషికొండలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. పట్టువస్త్రాలు సమర్పించారు.



అరకు కిటకిట

అరకులోయ రూరల్: దసరా పండగ నేపథ్యంలో శుక్రవారం అరకులోయ, యండపల్లివలస కేంద్రాలు కిటకిలాడాయి.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం పేర్కొన్నారు. ఈనెల 12న 3 మి.మీ, 13న 3 14న 1, 15న 1, 16న 11 మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు.

న్యూస్‌రీల్

ప్రజలందరినీ దుర్గాదేవి కరుణించాలి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి

దేవరాపల్లి: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమిని పురస్కరించుకొని జిల్లా ప్రజలందరికీ దుర్గాదేవి ఆశీస్సులు లభించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ఆకాంక్షించారు. ఆ జగన్మాత అనుగ్రహంతో ప్రజలంతా సుఖశాంతులు, సిరి సంపదలతో తలతూగాలని, జిల్లాలోని ప్రతీ కుటుంబానికి విజయాలు సిద్ధించాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయదశమి వేడుకలను తెలుగు ప్రజలంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, అమ్మలగన్నయమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ కరుణ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

సాగరతీరంలో వైజాగ్ ప్రీమియర్ లీగ్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

బీచ్‌రోడ్డు (విశాఖ): కేఆర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైజాగ్ ప్రీమియర్ లీగ్ సీజన్ 3 పురస్కరించుకొని శనివారం సాగరతీరంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జి.శ్రీధర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ రాజా, ఎం.రాజశేఖర్, పి.నర్సింగరావు, సుమన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టును సందర్శించిన ఆస్ట్రేలియన్ బృందం



పోర్టు అధికారులతో ఆస్ట్రేలియా బృందం

విశాఖ సిటీ: ఆస్ట్రేలియా డిప్యూటీ కాన్సులేట్ జనరల్ డేవిడ్ ఎగుల్స్‌టన్, ఆస్ట్రేలియా హై కమిషన్ ఫస్ట్ సెక్రటరీ గ్రేస్ విలియమ్స్ విశాఖ పోర్టును శుక్రవారం సందర్శించారు. పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్ కుమార్ దూబే వారికి సాదర స్వాగతం పలికారు. పోర్టులో ఉన్న సౌకర్యాలు, అభివృద్ధికి చేపడుతున్న వ్యూహాత్మక కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భవిష్యత్తులో ఆస్ట్రేలియాతో వ్యాపార సంబంధాలకు అవసరమైన సహకారాన్ని అందజేస్తామని తెలిపారు. ఆస్ట్రేలియా నుంచి కుకింగ్ కోల్‌ను దిగుమతి చేసుకుంటున్నామని, విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం ఆ బొగ్గును వినియోగిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా డిప్యూటీ కాన్సులేట్ జనరల్ డేవిడ్ ఎగుల్స్‌టన్ మాట్లాడుతూ భారత్ కు కావాల్సిన కోల్ అవసరాలను తెర్చే అవకాశం కలిగినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. పోర్టులో క్రూయిజ్ టెర్మినల్‌కు భారీ అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. వ్యాపార సౌలభ్యం, టర్న్ రౌండ్ టైమ్, కస్టమ్స్ క్లియరెన్స్, పోర్ట్ కనెక్టివిటీ, ట్రాన్స్‌షిప్‌మెంట్, క్రూయిజ్ ప్రయాణీకులు, ట్రాఫిక్, డ్రెడ్జింగ్ తదితర అంశాలపై చర్చించారు.

పౌరగ్రంథాలయం నిర్వహణ భేష్

సీతంపేట (విశాఖ): ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ ఎస్.శ్రీధర్ ద్వారకానగర్ పౌరగ్రంథాలయాన్ని శుక్రవారం సందర్శించారు. లైబ్రరీలోని అన్ని విభాగాలను పరిశీలించారు. విద్యార్థులు చదువుకోవడానికి లైబ్రరీలో మంచి సదుపాయాలు కల్పించారని గ్రంథాలయ సొసైటీని అభినందించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో సంభాషించారు. కార్యక్రమంలో శ్రావణ్ షిప్పింగ్ చైర్మన్ ఎస్.సాంబశివరావు, గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డి.ఎస్.వర్మ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాక్టికల్ పరీక్షలు వాయిదా

మద్దిలపాలెం (విశాఖ): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ తృతీయ సంవత్సరం 6వ సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలను ఈనెల 27వ తేదీకి వాయిదా వేసినట్టు డాక్టర్. వీఎస్.కృష్ణా కళాశాల అధ్యయన కేంద్రం రీజనల్ కో ఆర్డినేటర్ జి.రాజకుమార్ తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి జరగాల్సిన పరీక్షలను నాక్ బృందం సందర్శన కారణంగా వాయిదా పడ్డాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి 27వ తేదీ నుంచి జరిగే ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

జయజయహే మహిషాసుర మర్దని



అచ్యుతాపురం మండలం హరిపాలెంలోని శ్రీ విజయదుర్గ అమ్మవారు



మహిషాసురమర్దని అలంకరణలో నర్సీపట్నం దుర్గామల్లేశ్వరస్వామి

శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదవ రోజైన శుక్రవారం అమ్మవారు మహిషాసుర మర్దని అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. జిల్లాలోని వివిధ ఆలయాల్లో అమ్మవారి ప్రతిమలను, పలు మండపాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను భక్తులు దర్శించుకున్నారు. అనకాపల్లి నూకాంబిక అమ్మవారు, విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవార్ల దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కనకమహాలక్ష్మి శుక్రవారం మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. వాసవీ మాత మానసాదేవిగా విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో సౌభాగ్యవ్రతాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దుష్ట శక్తిపై దైవబలం సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పర్వదినాన్ని శనివారం జరుపుకోనున్నారు. జిల్లా అంతటా దసరా సందడి నెలకొంది. కొత్త వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడాయి. మాడుగుల కోటలో అలనాటి రాజుల సంప్రదాయానికి కొనసాగింపుగా ఈనాటికీ ఆయుధాలకు పూజలు చేస్తున్నారు. దసరా సందర్భంగా గతంలో గుర్రాల సంత నిర్వహించేవారు. మేలు జాతి గుర్రాల అమ్మకాలు, కొనుగోళ్లు జరిగేవి. అయితే నాలుగేళ్లుగా గుర్రాలు రాకపోవడంతో సందడి తగ్గిపోయింది. –సాక్షి న్యూస్ నెట్‌వర్క్



అనకాపల్లి కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



అనకాపల్లి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి లక్ష పసుపు కొమ్ములతో అర్చన



అనకాపల్లి గవరపాలెంలో శివశక్తి ఫ్రెండ్స్ ఏర్పాటు చేసిన 30 అడుగుల కనకదుర్గమ్మ

పంచేసుకున్నారు

- దరఖాస్తుల సమర్పణకు **ముగిసిన గడువు**
- కూటమి ఎమ్మెల్యేల **కనుసన్నల్లోనే** దుకాణాలకు **దరఖాస్తులు**
- ఈసారి ఒడిశా నుంచి **లిక్కర్ కింగ్‌ను** దింపిన **ప్రజాప్రతినిధులు**
- ఉమ్మడి విశాఖ జిల్లాలో **మొత్తం 331** షాపులకు 8,283 **దరఖాస్తులు**
- రాత్రి 11.15 వరకు **డీడీల స్వీకరణ**
- ఉమ్మడి విశాఖ నుంచి ప్రభుత్వ ఖజానాకు రూ.165.66 కోట్ల ఆదాయం



జిల్లా	మొత్తం షాపులు	వచ్చిన దరఖాస్తులు
విశాఖ	155	3,890
అనకాపల్లి	136	3,214
అల్లూరి	40	1,179
మొత్తం	331	8,283
సమకూరిన ఆదాయం : రూ.165.66 కోట్లు		

విశాఖ సిటీ/అనకాపల్లి :

కూటమి ప్రజాప్రతినిధులు లిక్కర్ షాపులు పంచేసుకున్నారు. ఆయా నియోజక వర్గాల్లో వారి అనుచరులతోనే దరఖాస్తులు చేయించారు. పేరుకు ఆన్‌లైన్ దరఖాస్తుల విధానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ..ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే దరఖాస్తుల సమర్పణ జరిగిందన్నది బహిరంగ రహస్యమే. మూడు రోజుల క్రితం వరకు ఒక్కో వైన్‌షాప్‌కు రెండు, మూడు దరఖాస్తులు మాత్రమే రావడంతో పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇది కూటమి ప్రభుత్వానికి తలనొప్పిగా మారడంతో ప్రజాప్రతినిధులు అప్పటికప్పుడు పరిస్థితిని చక్కదిద్దుకోవాల్సి వచ్చింది. అనుచరగణాన్ని రంగంలోకి దింపి పెద్ద ఎత్తున దరఖాస్తులు చేయించారు. దీంతో సగటున విశాఖ జిల్లాలో ఒక్కో వైన్‌షాప్‌కు 25, అనకాపల్లిలో 23, అల్లూరి జిల్లాలో ఒక్కో దుకాణానికి 29 వరకు దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తు రుసుం ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ప్రభుత్వ ఖజానాకు రూ.165.66 కోట్ల ఆదాయం సమకూరింది.

ఉమ్మడి విశాఖకు 8,283 దరఖాస్తులు

ఉమ్మడి విశాఖకు సంబంధించి మొత్తం 331 షాపులకు ఆయా జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో విశాఖ జిల్లాకు 155, అనకాపల్లికి 136, అల్లూరి జిల్లాకు 40 షాపులు కేటాయించారు. పది రోజులుగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. వాస్తవానికి ముందు నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 9వ తేదీతో గడువు ముగియాల్సి ఉంది. కానీ ప్రభుత్వం 11వ తేదీ వరకు గడువు పొడిగించింది. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసింది. అయితే ఇంకా 70 మంది వరకు డీడీలు చెల్లించాల్సి ఉంది. వీరికి టోకెన్లు అందించి రాత్రి 11.15 గంటలలోగా డీడీలు చెల్లించే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసే సమయానికి విశాఖ జిల్లాకు 3,890 దరఖాస్తులు వచ్చాయి. అలాగే అనకాపల్లి జిల్లాలో దుకాణాలకు 3,214, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,179 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

కూటమి ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే..

గత ఐదేళ్లు ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహించడంతో కూటమి నేతల ఆదాయానికి గండి పడింది. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నూతన మద్యం పాలసీ పేరుతో మళ్లీ వైన్‌షాపులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని నిర్ణయించింది. దీంతో కూటమి ప్రజాప్రతినిధులు మద్యం సిండికేట్లను రంగంలోకి దింపారు. అయితే 2019 వరకు టీడీపీ ఎమ్మెల్యేకు ఒక సిండికేట్‌లో వాటాలు ఉండడంతో జిల్లా అంతటా ఆయన హవా నడిచింది. కానీ ఈసారి సదరు ఎమ్మెల్యేకు చెక్ పెట్టేందుకు సొంత పార్టీలోనే మరో కీలక ఎమ్మెల్యే సిద్ధమయ్యారు. దీంతో సిండికేట్ల మధ్య కూడా కొంత మేర చీలికలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఒక ఎమ్మెల్యే ఏకంగా ఒడిశా నుంచి ఒక లిక్కర్ కింగ్‌ను విశాఖ మద్యం వ్యాపారంలోకి దింపినట్లు చర్చ జరుగుతోంది. ఈసారి ఆన్‌లైన్ ద్వారా ఒడిశా నుంచి కూడా దరఖాస్తులు వచ్చాయి. టీడీపీ ఎమ్మెల్యే వెనకుండి ఒడిశాలో లిక్కర్ వ్యాపారాన్ని శాసిస్తున్న వారిని విశాఖకు తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు సిండికేట్లలోనే టాక్ నడుస్తోంది. ఇదిలా ఉంటే జిల్లాలో వైన్‌షాపుల కేటాయింపు విషయంలో కూడా పెద్ద ఎత్తున పోటీ నెలకొనడంతో నియోజకవర్గాల వారీగా పంచుకోవాలని చివరి నిమిషంలో ఒక ఒప్పందానికి వచ్చినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం నియోజకవర్గాల వారీగా షాపులను తమ సిండికేట్లతో పాటు తమ అనుచర గణానికి దక్కేలా వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం.

ఎవరైనా బయటి వ్యక్తులు లాటరీ ద్వారా షాపు దక్కించుకుంటే.. వారు కూడా తప్పనిసరిగా సిండికేట్‌లో చేరేలా ఒత్తిడి చేసి దారికి తెచ్చుకునేలా చేయాలని ఇప్పటికే ఎక్సైజ్ అధికారులకు కూడా మౌఖిక ఆదేశాలు సైతం జారీ చేసినట్లు తెలిసింది. అలాగే మహారాణిపేట, సీతమ్మధార, గోపాలపట్నం, గాజువాక, పెందుర్తి, భీమిలిలలో ఇప్పటికే సిండికేట్లు వైన్‌షాపుల కోసం లీజులు సైతం చెల్లించడం విశేషం. దీనికి ఆయా సర్కిళ్ల పరిధిలో ఎక్సైజ్ అధికారులు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించారు.

14న దుకాణాలకు డ్రా

ఈనెల 14న అనకాపల్లి పట్టణంలో శ్రీసత్య గ్రాండ్ ఫంక్షన్ హాల్లో ఉదయం 8 గంటలకు షాప్‌లకు డ్రా తీయనున్నట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సుధీర్ గురువారం చెప్పారు. జిల్లాలో 136 దుకాణాలకు 3,214 అప్లికేషన్లు వచ్చినట్లు పేర్కొన్నారు. అనకాపల్లి పట్టణం, మండలంలో 15 షాప్‌లకు 372 దరఖాస్తులు, నర్సీపట్నం మండలం 21 షాప్‌లకు 543, గొలుగొండ మండలం 8 షాప్‌లకు 234, యలమంచిలి మండలం 20 షాప్‌లకు 560, చోడవరం మండలం 22 షాప్‌లకు 530, పాయకరావుపేట మండలం 18 షాప్‌లకు 364, వి.మాడుగుల మండలం 13 షాప్‌లకు 284, సబ్బవరం మండలంలో 19 షాప్‌లకు 327 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన చెప్పారు.

అప్పన్న జమ్మివేట ఉత్సవం రేపు

- ముస్తాబైన పూలతోట
- రాముడిగా దర్శనమివ్వనున్న స్వామి
- 6 గంటల వరకే సింహగిరిపై దర్శనాలు



ముస్తాబైన పూలతోట ప్రధాన మార్గం

సింహాచలం: విజయదశమి సందర్భంగా ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జమ్మివేట ఉత్సవం జరగనుంది. కొండదిగువ పూలతోటలో ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేశారు. స్వామి పూజలందుకునే పూలతోటలోని ప్రధాన మండపానికి, శ్రీకృష్ణ కొలనుకి రంగులు వేశారు. పారిశుధ్య పనులు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గోపాలపట్నం పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సవం ఇలా..

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని రాముడిగా అలంకరించి.. ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పల్లకీలో మెట్ల మార్గంలో కొండదిగువకి తీసుకొస్తారు. అక్కడి పూల తోటలోని ప్రధాన మండపంలో స్వామిని అధిష్టింపజేస్తారు. తొలుత పూల తోటలోని శమీవృక్షం చెంతన శమీపూజ చేస్తారు. ఆ శమీ దళాలను స్వామి చెంతన ఉంచి పూజలు చేసి.. జమ్మివేట ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్వామిని పుష్కరిణి మండపం వద్దకు తీసుకొచ్చి.. అక్కడ ఉండే అశ్వవాహనంపై అధిష్టిస్తారు. తర్వాత అడవివరంలో స్వామిని అశ్వ వాహనంపై తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం అర్ధరాత్రి సమయంలో స్వామిని కొండపైకి చేరుస్తారు. జమ్మివేట ఉత్సవం నేపథ్యంలో సింహగిరిపై ఆదివారం సాయంత్రం 6 గంటల వరకే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దర్శనాలు లభిస్తాయని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



ముస్తాబైన స్వామి అధిష్టించే ప్రధాన మండపం

నేత్రపర్వంగా మృగవేట



గజవాహనంపై స్వామివారిని మృగవేటకు తీసుకెళ్తున్న అర్చకులు



లంకమండపం వద్ద మృగవేటలో భాగంగా ధనుర్బాణాలు సంధిస్తున్న అర్చక స్వాములు

- గజవాహనంపై స్వామివారి తిరువీధి సేవ

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మృగవేట నేత్రపర్వంగా జరిగింది. ఉదయం ఆలయంలో నిత్యపూజలు, ప్రసాద నివేదనలు, విశేష హోమాలు నిర్వహించారు. తదుపరి సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో ఉంచి ఆలయంలోను, మాఢ వీధుల్లో తిరువీధి సేవలో బలిహరణలు పూర్తిచేశారు. సాయంత్రం నిత్యకార్యక్రమాల్లో భాగంగా ప్రసాద నివేదనలు, విశేష హోమాలు నిర్వహించి, సుదర్శన పెరుమాళ్లను పల్లకిలోఉంచి గ్రామ బలిహరణలు పూర్తిచేశారు. తర్వాత గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన చేశారు.అనంతరం శ్రీదేవీ,భూదేవీ సమేత కల్కి వేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులను మృగవేట కార్యక్రమంలో భాగంగా గజ వాహనంపై అధిష్టింపజేసి పుష్కరిణి వద్ద ఉన్న లంక వారి మండపానికి తీసుకెళ్లారు.అక్కడ మృగవేట కార్యక్రమాన్ని నిర్వహించారు. ధనుర్బాణాలు సంధించే సన్నివేశాన్ని అర్చక స్వాములు నిర్వహించారు. తర్వాత ఆలయంలో నిత్యకార్యక్రమాలు, ప్రసాదనివేదనలు,తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం జరిగాయి.ఈకార్యక్రమాల్లో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు పాల్గొన్నారు.

'గద్దర్ అన్న యాదిలో..' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మజ్జి దేవీశ్రీ

ఎంవీపీకాలనీ (విశాఖ): ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్న యాదిలో.. పోస్టర్‌ను ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న విశాఖ పౌర గ్రంథాలయంలో గద్దర్ పాటలు, పోరాటాలను తెలియజేస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గొప్ప పాటలు రాసిన రికార్డ్ గద్దర్‌కు దక్కుతుందన్న ఆయన సాహిత్యం ఈ సమాజంలో ఉన్నంతకాలం గద్దర్ పాటలు, రచనలు సజీవంగా ఉంటాయన్నారు. ప్రజా కళా మండలి, ప్రజానాట్య మండలి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రజా ఉద్యమ అమర కళాకారుల వేదిక, జన చైతన్య మండలి, విశ్వజన కళామండలి, ఉత్తరాంధ్ర సంగీత జానపద కళాపీఠం తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతున్నట్లు చెప్పారు.

బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం (విశాఖ): విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ రైలుకు అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖ-బ్రహ్మపూర్ (18526) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు, బ్రహ్మపూర్-విశాఖ(18525) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 12 నుంచి 17 వరకు రెండు జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను జత చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో దీపారాధన



దీపాల కాంతుల్లో 18 అడుగుల దుర్గమ్మ చిత్రం

ఎస్.రాయవరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేమగిరి గ్రామంలో శుక్రవారం దుర్గమ్మ సన్నిధిలో దీపారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన కూరపాటి దుర్గ సుమారు రెండు గంటల పాడు శ్రమించి 18 అడుగుల అమ్మవారి చిత్రాన్ని వేసి, చుట్టూ దీపాలు వెలిగించారు. దీప కాంతుల మధ్య అమ్మవారు కనువిందు చేశారు.

మహాలక్ష్మిగా కనకమహాలక్ష్మి



దాబాగార్డెన్స్ (విశాఖ): శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పలు రకాల కూరగాయాలతో శాకంబరీగా పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. అమ్మవారికి అలంకరించిన పట్టు చీరలను లక్కీ షాపింగ్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాజమాన్యాలు అందజేశాయి. శనివారం స్వర్ణలక్ష్మి అలంకరణలో కనకమహాలక్ష్మి దర్శనమివ్వనున్నారని, 108 బంగారు పుష్పాలతో స్వర్ణ పుష్పార్చన చేస్తామని ఈవో కె.శోభారాణి తెలిపారు. ఏఈవో కె.తిరుమలేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దసరా.. సందడేదీ?

- మార్కెట్లో కనిపించని కళ
- ప్రజల్లో క్షీణించిన కొనుగోలు శక్తి
- ప్రభుత్వం నుంచి అందని పథకాలు
- బేల చూపులు చూస్తున్న జనం
- గతేడాది రూ.100 కోట్లు దాటిన వ్యాపారాలు
- ఈ ఏడాది రూ.50 కోట్లు దాటితే పండగే



కొనుగోలుదారులు లేక దిగాలుగా ఉన్న వ్యాపారులు

సాక్షి, విశాఖపట్నం : సంక్రాంతి తర్వాత.. ఉత్తరాంధ్ర ప్రజలు పండగ చేసుకునేది దసరా రోజునే. పిండివంటలు.. కొత్త బట్టలు.. ఘుమఘుమలాడించే నాన్‌వెజ్ వంటకాలతో ఊరు వాడా సందడి వాతావరణం కనిపిస్తుంది. వారం రోజులు ముందుగానే మార్కెట్‌లో కళకళలాడుతుంటాయి. కానీ.. ఈ సారి ఆ పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. మార్కెట్‌లో సందడి లేదు.. జనంలో ఉత్సాహం లేదు. ప్రభుత్వం నుంచి పథకాల లబ్ధి రాక.. ప్రజల్లో కొనుగోలు శక్తి సన్నగిల్లిపోవడంతో దసరా మార్కెట్ బోసిపోయింది.

దసరా పండగను ప్రతి ఒక్కరూ వైభవంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇంటికి కొత్త వస్తువును తీసుకొని రావడం సంప్రదాయంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో వ్యాపారాలు.. మూడు ఆఫర్లు.. ఆరు కొనుగోళ్లులా కళకళలాడుతుంటాయి. ప్రధానంగా టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, ఏసీలతో పాటు మొబైల్స్ కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతుంటాయి. అలాగే వాహనాల కొనుగోళ్లు కూడా నాలుగైదు రోజులుగా జోరందుకునేవి. ఈ దసరాకు మాత్రం అంతా నిశ్శబ్దంగా మారింది. ఆఫర్లు ఉన్నా.. కొనుగోళ్లు కనిపించడం లేదు. కొత్త స్టాక్ వచ్చినా.. ఏ మాత్రం సేల్ అవ్వడం లేదు. ఎందుకంటే.. ప్రజలు ఈ దసరాని ఉత్సాహంగా జరుపుకునేందుకు అంతగా ఆసక్తి చూపించడం లేదు. జనం దగ్గర డబ్బులు లేకపోవడమే ప్రధాన కారణం. గత ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి వివిధ పథకాల ద్వారా నగదు లబ్ధి ప్రజలకు చేరుతుండేది. ఆ నగదు తమ ఆర్థిక అవసరాలకు వినియోగించుకునేవారు. ఉదాహరణకు దసరా సమయంలో వైఎస్సార్ చేయూత పేరుతో రూ.18,750 కొన్ని సందర్భాల్లోనూ వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న చేదోడు, వాహనమిత్ర.. ఇలా విభిన్నమైన పథకాల ద్వారా ఏదో ఒక రూపంలో నగదు బదిలీ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరేది. ఈ డబ్బులు మార్కెట్‌లో రొటేటింగ్ జరిగేది. ఫలితంగా.. మార్కెట్లు కళకళలాడుతుండేవి. తద్వారా కొనుగోళ్ల ద్వారా వ్యాపార సంస్థల నుంచి పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు నగదు చేరేది. మళ్లీ ఆ నగదు.. ప్రజల ఖాతాల్లోకి మరో పథకం రూపంలో జనాలకు అందజేసేవారు. ఇలా నగదు చలామణి జరిగేది. దీనివల్ల అటు ప్రజలు.. ఇటు వ్యాపారులు పండగ చేసుకునేవారు. ఈ దసరా మాత్రం అందరికీ చేదు అనుభవాన్ని అందిస్తోంది.

ప్రభుత్వం నుంచి పైసా రాక..

సూపర్ సిక్స్ అంటూ ఊదరగొడుతూ.. అలవి కాని హామీలతో అందలమెక్కిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల గురించి పట్టించుకోవడం మానేసింది. గద్దెనెక్కి 120 రోజులు గడిచినా.. ఇంతవరకూ ప్రజలకు ఒక్క పథకాన్ని కూడా అందించలేదు. ఫలితంగా.. ప్రజల బ్యాంకు ఖాతాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. దీంతో దసరాకు ఏదో ఒక విధంగా.. షాపింగ్ చేసుకునే ప్రజలు ఇప్పుడు నిరాశగా ఉన్నారు. పండగ పూట పస్తులుండేలా ప్రభుత్వం చేసిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ ఈసారి పండగని ఎలాగోలా కానిచ్చేద్దామంటున్నారు.

రూ.10 కోట్లైనా దాటలేదు..!

దసరా రోజున కొత్త వస్తువుల కొనుగోళ్లలో మొబైల్ రంగం అగ్రస్థానంలో నిలుస్తోంది. గత నాలుగైదేళ్లుగా దసరా సమయంలో మొబైళ్ల విక్రయాలు ఎక్కువగా జరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రెండో స్థానంలో ఎలక్ట్రానిక్ పరికరాలదే. మధ్య తరగతి, దిగువ తరగతి ప్రజలు దసరా సందర్భంగా ఇంట్లో వినియోగించే గృహోపకరణాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. ప్రధానంగా టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలతోపాటు అనేక ఎలక్ట్రానిక్ పరికరాల కొనుగోళ్లతో నాలుగేళ్ల పాటు కళకళలాడేవి. గత దసరా సీజన్‌లో ఈ రెండింటి మార్కెట్ రూ. 30 నుంచి 40 కోట్ల రూపాయల వరకు జరిగిందని..ఈసారి ఇప్పటి వరకూ రూ.10 కోట్లెన్నా దాటలేదని వ్యాపారులు వాపోతున్నారు. అదేవిధంగా పండగ వచ్చిందంటే ముందుగా కొత్త వస్త్రాలు కొనుగోళ్లే అధికంగా ఉంటాయి. వస్త్ర వ్యాపారులు కూడా మహిళలను ఆకర్షించేందుకు అనేక ఆఫర్లు ప్రకటించారు. ఏటా ఆఫర్ల హంగామాతో కళకళలాడుతుండే వస్త్ర ప్రపంచాలు ఈసారి బోసిపోతున్నాయి. ప్రతి ఏటా రూ.50 కోట్ల వరకూ వ్యాపారాలు జరిగేవి. ఈసారి మాత్రం రూ.25 కోట్లు మించినా చాలని అంటున్నారు. కానీ.. ఆ మేర కొనుగోళ్లు జరగకపోవడంతో వ్యాపార వర్గాల్లోనూ దసరా పండగ కనిపించడం లేదు. మొత్తంగా దసరా వ్యాపారం జిల్లాలో రూ.100 కోట్ల వరకూ జరుగుతుంటుంది. ఈసారి రూ.50 కోట్లు జరిగినా.. మాకు పండగ వచ్చినట్లే అని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. ఇలా.. కూటమి ప్రభుత్వ అబద్ధాల వైఖరి వల్ల.. అన్ని వర్గాల్లోనూ దసరా సరదా లేకుండానే పోయింది.

జీతమూ లేదు..బోనస్సూ లేదు

- స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు షాక్
- దసరా పండుగ వేళ ఆందోళన
- కూటమి నేతల హామీలపై ఆగ్రహం

సాక్షి, విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు దసరా సందడి లేకుండా పోయింది. పది నెలలుగా 10వ తేదీలోగా ఇచ్చే సగం జీతం ఇవ్వకపోగా ఎప్పుడూ లేని విధంగా దసరా ముందు చెల్లించే బోనస్ ఎగ్గొట్టారు. ఈ విషయంపై కార్మిక సంఘాల నాయకులు చేతకాని వారిగా మిగలగా స్టీల్‌ప్లాంట్ కోసం ప్రగల్భాలు పలుకుతున్న ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల స్టీల్‌ప్లాంట్ అంశంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు మంత్రి కుమారస్వామిలతో చర్చించామని.. ప్లాంట్‌కు సంబంధించి ప్యాకేజిని అందించడానికి కేంద్రం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియా మీట్‌లో చెప్పగా, విశాఖ ఎంపీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తాము స్టీల్‌ప్లాంట్ విషయంలో చిత్తశుద్ధితో ఉన్నామని ప్రకటనలు చేశారు. వీరి చెప్పిన మాటలు బట్టదాఖలు కావడంతో కార్మిక వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ ఏడాది సెయిల్‌లో రూ. 26,500 బోనస్ చెల్లించగా.. స్టీల్‌ప్లాంట్ కార్మికులు మొత్తం బోనస్ ఎగ్గొట్టారు. ప్రతినెలా పదోతేదీలోగా ఇచ్చే సగం జీతం కూడా 15వ తేదీ తరువాత ఇస్తామని ప్రకటించడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సగ జీతం కోసం రూ. 40 కోట్లు లేని పరిస్థితిలో యాజమాన్యం ఉందంటే ఉద్యోగులు నమ్మడం లేదు. కావాలనే ఈ పరిస్థితిని సృష్టించారని ఉద్యోగులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అమరావతి, పోలవరం నిర్మాణాల కోసం అవసరమైన ఐరన్ కోసం కనీసం రూ. 100 కోట్లు అడ్వాన్స్ ఇచ్చినా ఉద్యోగుల పూర్తి జీతం చెల్లించవచ్చు. అయితే మాటలే తప్ప చేతలు లేని కూటమి నాయకులు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

యోగాతో ఆరోగ్యంగా జీవించవచ్చు



మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతిస్వామి



యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: అష్టైశ్వర్యాల్లో ముఖ్యమైనవి ఆయువు, ఆరోగ్యమని, అవి యోగాతోనే సాధ్యమని సద్గురు రాజర్షి ఆత్మానంద స్వామి పడాల అప్పారావు, ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు, ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతిస్వామి తెలిపారు. స్థానిక లక్ష్మీదేవిపేటలో యోగా, జ్ఞాన, ధ్యాన క్రియపై అవగాహన పోటీలు శుక్రవారం జరిగాయి. వారు మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. యోగా నేర్చుకుని, మానసిక ఒత్తిడి, దీర్ఘకాలిక వ్యాధుల నుంచి విముక్తి పొందాలన్నారు. అనంతరం యోగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. శ్రీరామచంద్రా మిషన్, పంతంజలి యోగా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

గుడివాడ గురునాథరావు సేవలు మరువలేనివి



తగరంపూడిలో గురునాథరావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, దంతులూరి దిలీప్‌కుమార్



రింగ్ రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ఉమ్మడి విశాఖలో దివంగత మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో శుక్రవారం గురునాథరావు 69వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం భరత్‌కుమార్ మాట్లాడుతూ హర్యానాలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో అవకతవకలు జరిగాయని దేశవ్యాప్తంగా చర్చ జరుతుందన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలన్నారు. సమష్టిగా ఉండడంతో ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూడా కార్యకర్తలు అందరూ సమష్టిగా పని చేయాలని కోరారు. ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం కల్పించేందుకు పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలకు, కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు తేడాలు ఇప్పటికే ప్రజలు గుర్తించారన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ గురునాథరావు విలువలతో కూడిన రాజకీయాలు చేయడం వల్ల ఉత్తరాంధ్రలో నేటికీ మంచిపేరు ఉందన్నారు. హర్యానా ఎన్నికల్లో జరిగిన విధంగా మన రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఉన్నాయని రాష్ట్ర ప్రజలకు ఇప్పటికే అర్థమైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ(జోషఫ్), జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, కశింకోట ఎంపీపీ కలగ లక్ష్మిగున్నయ్యనాయుడు, పార్టీ నాయకులు కె.ఎం.నాయుడు, పలకా సత్యనారాయణ, జి.రామమూర్తి, ఆళ్ల నాగేశ్వరరావు, ప్రభాకర్, కడిమిశెట్టి సతీష్, కరకసోము నాయుడు, మనోజ్, కోరుకొండ రాఘవ, ఉగ్గిన అప్పారావు, గొన్నాబత్తుల బాబురావు, చంటి, కోన ఉమా, కల్యాణ్ పాల్గొన్నారు.

- అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామంలో గురునాథరావు విగ్రహానికి ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అయితా ఆనందరాము, గ్రామ సర్పంచ్ అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

12 అడుగుల గిరినాగు పట్టివేత



చిన్న పామును మింగిన గిరినాగు

చీడికాడ: మండలంలోని అర్జునగిరి పొలాల్లో శుక్రవారం సాయంత్రం 12 అడుగుల గిరినాగును అటవీ శాఖకు చెందిన స్నేక్ క్యాచర్లు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. పసుపు గెడ్డ సమీప సాగేత్త పొర్లు కట్ట వద్ద సాయంత్రం 4 గంటల సమయంలో నీటిపామును మింగిన గిరినాగు ఎటూ కదల్లేక ఉండడాన్ని రైతులు గమనించారు. ఈ విషయాన్ని అటవీ శాఖాధికారులకు తెలియజేయడంతో వారు వచ్చి పామును పట్టుకున్నారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

మునగపాక: మండలంలోని మడకపాలెంకు చెందిన ఓ వృద్ధురాలు కాలిన గాయాలతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. మడకపాలెం గ్రామానికి చెందిన యలమంచిలి బుల్లమ్మ(65) ఈ నెల 3న ఇంటిలో నిద్రిస్తుండగా మంచం కింద వెచ్చదనం కోసం పెట్టిన బొగ్గుల కుంపటి నుంచి మంటలు ఎగసిపడడంతో గాయపడింది.

దీంతో ఆమె కేకలు వేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న చూచుకొండ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి ఆమె మృతి చెందింది. ఏఎస్‌ఐ మన్మథరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సైకిల్ పైనుంచి పడి వృద్ధుడి మృతి

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం ఇరువాడ సమీపంలో శుక్రవారం ప్రమాదవశాత్తు సైకిల్ పైనుంచి పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మునగపాక మండలం కొత్త నాగవరం గ్రామానికి చెందిన కూనిశెట్టి అప్పారావు(69) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం సాయంత్రం అచ్యుతాపురం మండలం ఇరువాడ సమీపంలోని మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసుకుని ఇంటికి వస్తుండగా సైకిల్ పైనుంచి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో మృతి చెందాడు. ఈ మేరకు అచ్యుతాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కేజీబీవీలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చెయ్యపేట: వడ్డాది కోవెల అప్పన్నదొర జెడ్పీ హైస్కూల్ ఆవరణలో కొత్తగా ప్రారంభించనున్న కేజీబీవీ హాస్టల్‌లో కుక్ పోసుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈవోలు బొంజుబాబు, కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. హెడ్ కుక్–1, అసిస్టెంట్ కుక్–1, చౌకీదారు–1 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా బుచ్చెయ్యపేట ఎంఈవో కార్యాలయంలో నేరుగా దరఖాస్తులను అందజేయాలన్నారు.

క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు మిఠాయిల పంపిణీ


కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సునీత, జానకీరామరాజు

అనకాపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక నర్సింగరావుపేటలో వారి స్వగృహంలో 82వ వార్డు జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నారని, నిత్యం పారిశుధ్య కార్మికులు వార్డు పరిశుభ్రతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోన ఉమా, సత్తిబాబు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు వాహనాలు ఒకదానికొకటి ఢీ

కశింకోట: స్థానిక గ్రామ శివారులో జాతీయ రహదారిపై నాలుగు వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదంలో ప్రాణాపాయం తప్పింది. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న లారీని వెనుక వస్తున్న కారు ఢీకొంది. దీంతో వీటి వెనుక వస్తున్న రెండు లారీలు ఢీకొన్నాయి. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని పోలీసులు తెలిపారు. కారు, లారీ ముందు భాగం దెబ్బతిన్నాయన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థులతో అప్పటి ఉపాధ్యాయులు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2006–07లో టెన్త్ చదివిన 80 మంది విద్యార్థులు పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు సీహెచ్.అప్పలస్వామి, వరప్రసాదం, భాగ్యలక్ష్మి, నారాయణమూర్తి, రాంబాబు, పోతురాజు, యాకా నర్సింహమూర్తి తదితరులను సన్మానించారు. అనంతరం పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సాయంత్రం వరకు ఆటాపాటలతో గడిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 323 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,000	5,280
రెండో రకం	3,600	4,210
మూడోరకం	3,250	3,500

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
విశ్వం	: సత్యనారాయణ స్క్రీన్-1
శ్వాగ్	: సత్యనారాయణ స్క్రీన్-2
వేట్టయన్	: పర్తిసాయి
వేట్టయన్	: షిర్డిసాయి
జిగ్రా	: వెంకటేశ్వర
మా నాన్న సూపర్ హీరో	: శ్రీసత్య
మార్టిన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 74 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–10 యూనిట్లు, బీ పాజిటివ్–32 యూనిట్లు, ఓ పాజిటివ్–28 యూనిట్లు, ఏబీ పాటిజివ్–4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 416 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 397 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

యూరియా.. ఏదయా?

రైతులకు 2014 నాటి కష్టాలు మొదలయ్యాయి. వీరంటే సీఎం చంద్రబాబుకు మొదటి నుంచే చులకన భావమే.. ఇప్పటికే పెట్టుబడి సాయం ఇవ్వకుండా మోసం చేయగా, తాజాగా ఏపుగా పెరగాల్సిన వరి పంటకు యూరియా లేకుండా చేశారు. దాంతో అటు రైతు సేవా కేంద్రాల్లో దొరక్కపోగా, ఇటు సహకార బ్యాంకుల్లో నిల్వలు దాచుకుని ముప్పు తిప్పలు పెడుతున్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఇటువంటి పరిస్థితి ఏనాడూ రాలేదని రైతులు ఘంటాపథం చెబుతూ కూటమి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు.


వరి పొలాలు

- పంటలకు సరిపడా నిల్వలు లేవు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- ఆర్బీకేల్లో లభించక రైతుల ఇబ్బందులు
- చోద్యం చూస్తున్న కూటమి ప్రభుత్వం

తుమ్మపాల: ఖరీఫ్ సీజన్‌లో కూటమి ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపిస్తోంది. ఒక పక్క కృత్రిమ కొరత సృష్టించి నిత్యావసర ధరలు పెంచింది. చివరిలో ధరల నిర్మూలన అంటూ హోల్‌సేల్ డీలర్లతో కుమ్మక్కై ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి కొత్త తరహా రాజకీయానికి శ్రీకారం చుట్టింది. ఖరీఫ్ రైతులకు వరి విత్తనాల దగ్గర నుంచి ఎరువుల వరకు మొదట కొరత సృష్టించి తర్వాత ఆదుకున్నట్లు వ్యూహ రచనలు చేస్తోంది. ఇప్పుడు యూరియా కృత్రిమ కొరత సృష్టించి కార్యాలయాల చుట్టూ తిప్పిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి రైతుకు తంచనుగా సేవలందగా, ఇప్పుడు కష్టాల పాల్జేస్తోంది.

40 శాతం మేర యూరియా కొరత.... మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ విస్తీర్ణం 6,045 ఎకరాల మేర ఉంది. ఇటీవల భారీ వర్షాలకు అన్ని గ్రామాల్లోను వరి ముంపునకు గురై పంటలు దెబ్బతిన్నాయి. దీంతో వ్యవసాయ అధికారులు పర్యటించి ప్రతి రైతు తప్పనిసరిగా యూరియా వినియోగించాలని సూచించారు. ఆ మేరకు రైతుల యూరియా కోసం పరుగులు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో రైతు సేవా కేంద్రాల్లో యూరియా లేకుండా చేశారు. దీంతో రైతులకు యూరియా దొరక్క నానా ఇక్కట్లు పడుతున్నారు. మండలంలో కొన్ని రైతు సేవా కేంద్రాలు, సహకార బ్యాంకులకే యూరియా పరిమితం చేసి తిప్పిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు నాలుగు వేల ఎకరాలకు మాత్రమే యూరియా అందినట్లు సమాచారం. ఇంకా రెండు వేల ఎకరాల వరి రైతులకు దొరకడం లేదు.

సగానికి పైగా యూరియా లేదు...
మండలంలో 26 గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ప్రతి కేంద్రంలోనూ సరిపడా యూరియా నిల్వ గదులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల్లో కాకుండా సహకార బ్యాంకుల్లో యూరియా నిల్వలు ఉంచి రైతులను ముప్పుతిప్పలు పెడుతోంది. మండలంలో తుమ్మపాల సహకార బ్యాంకు, పట్టణంలో గౌరీ సహకార బ్యాంకుల్లో మాత్రమే యూరియా నిల్వలు ఉండటంతో అన్ని గ్రామాల ప్రజలు వ్యయ ప్రయాసలకోర్చి యూరియా కోసం తిరుగుతున్నారు. రైతు సేవా కేంద్రాలు నిరుపయోగంగా మార్చేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

డిమాండ్ తగ్గ యూరియా అందుబాటులో ఉంచాం



ఖరీఫ్ వరికి సరిపడా యూరియా సిద్ధంగానే ఉంచాం. కాని మండలంలో పశువుల గడ్డి పెంపకం విపరీతంగా పెరిగింది. దీంతో రైతులు యూరియా తీసుకుని పశువుల గడ్డికి వినియోగించడం వల్ల వరి పంటకు కొరత ఏర్పడింది. సహకార బ్యాంకులతో పాటు రైతు సేవా కేంద్రాల్లోనూ యూరియా అందుబాటులో ఉంచుతున్నాం. ఆరు వందల టన్నుల డిమాండ్ పెట్టగా, ఐదు వందల టన్నుల యూరియా రైతులకు సరఫరా చేస్తున్నాం.

-పి.రంగాచారి, మండల వ్యవసాయ అధికారి, అనకాపల్లి

ప్రజల మనిషి మాజీ మంత్రి గురునాథరావు


గురునాథరావుకు నివాళులర్పిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్

కశింకోట: దివంగత మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు ప్రజల మనిషి అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్ వద్ద గురునాథరావు జయంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ గురునాథరావు ఎన్నో పోరాటాల చేసి ప్రజా నాయకునిగా సుస్థిర స్థానం సంపాదించారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, మాజీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, అనకాపల్లి ఎంపీపీ గొర్లె సూరిబాబు, తాళ్లపాలెం మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణ రావు, చింతలపాలెం సర్పంచ్ కొట్టి రాము, నాయకులు మలసాల కుమార్‌రాజా, అద్దెపల్లి శ్రీను, బుల్లెట్ రాజు, ఉప్పనూరి అప్పారావు పాల్గొన్నారు.

19 మద్యం షాపులు.. 327 దరఖాస్తులు

- 14న అనకాపల్లిలో లాటరీ
- ఎక్సైజ్ సీఐ అనిల్‌కుమార్



సబ్బవరం: సబ్బవరం సర్కిల్ పరిధి సబ్బవరం, పరవాడ మండలాల్లో మద్యం షాపుల ఏర్పాటుకు 327 దరఖాస్తులు వచ్చినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సబ్బవరంలోని 8 మద్యం షాపులకు 226, పరవాడలోని 11 షాపులకు 101 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ విధానంలో రాత్రి 7 గంటల లోపు దరఖాస్తు చేసుకున్నవారినే పరిగణనలోకి తీసుకున్నట్లు వెల్లడించారు. 14న ఉదయం 8 గంటలకు అనకాపల్లి పట్టణం గవరపాలెంలోని సత్యాస్ లక్ష్మీ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహిస్తామన్నారు. షాపుల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఆరోజు ఉదయం 8 గంటల్లోపే చేరుకోవాలని కోరారు.

దుర్గమ్మ దీవించు..

- ఆలయాల్లో నిత్య పూజలు
- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- పలు అలంకరణల్లో అమ్మవార్ల దర్శనం


నూకాంబికను దర్శించుకుంటున్న వ్యాపారవేత్త పసతాల కామేశ్వరరావు భాగ్యలక్ష్మి దంపతులు


సత్యనారాయణపురంలో మహిషాసురమర్ధని అలంకరణలో కనకదుర్గమ్మ


కశింకోట శివాలయంలో మహిషాసురమర్థినిగా సర్వమంగళాంబ


8 కేజీల యాలకులు, రెండు కేజీల లవంగాల అలంకరణతో కామాక్షిదేవి


మహిషాసురమర్ధని అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ

అనకాపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. తొమ్మిదోరోజు శుక్రవారం ఆలయాల్లో కుంకుమ పూజలు, హోమాలు జరిపారు. తెల్లవారు జాము నుంచి దేవాలయాలు, మండపాలు దేవీ నామస్మరణతో మార్మోగాయి.


దుర్గాదేవి అలంకరణలో గౌరీదేవి

నూకాంబిక అమ్మవారి బాలాలయంలో..
ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారికి వ్యాపారవేత్త పసతాల కామేశ్వరరావు భాగ్యలక్ష్మి దంపతులు సహస్ర కమలార్చన, తోమాల సేవ వంటి కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని వీరితోపాటు సాయి మోగేష్, భవానీ దంపతులు ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిషాసురమర్ధనిగా సతకంపట్టు కనకదుర్గమ్మ...
స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ మహిషాసుర మర్ధని అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు భోగారపు వెంకటరమణ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, హోమాలు చేపట్టారు. గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీదేవి మహిషాసురమర్దనిగా దర్శనమిచారు. అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు.

30 అడుగుల కనకదుర్గమ్మ..
స్థానిక గవరపాలెం పార్కుసెంట్ రహదారిలో శివశక్తి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 30 అడుగుల కనకదుర్గమ్మ విగ్రహం ఆకట్టుకుంటోంది. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. శివశక్తి ఫ్రెండ్స్ ఉత్సవ కమిటీ చైర్మన్ బుద్ధ జగన్నాథరావు, వైస్ చైర్మన్ కొణతాల గణేష్, నిర్వాహకుడు అత్తిలి మోహనరావు, కమిటీ కన్వీనర్ దాడి మురళి పాల్గొన్నారు.


అన్న సమారాధనలో భక్తులు


నూకాంబిక అమ్మవారి ఆలయంలో అన్నసమారాధన


గవరపాలెం పార్కుసెంట్ వద్ద హోమం నిర్వహిస్తున్న భక్తులు

భద్రకాళిదేవి అవతారంలో కామాక్షిదేవి....
స్థానిక నిదానందొడ్డిలో కామాక్షమ్మ ఆలయంలో అమ్మవారు భక్తులకు భద్రకాళిదేవిగా దర్శనమిచ్చారు. కామాక్షిదేవి మూలవిరాట్‌కు 8 కేజీల యాలకులు, రెండు కేజీలు లవంగాలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

నవదుర్గాదేవి అవతారంలో..
స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు నవదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. లక్ష పసుపు కొమ్ములతో అమ్మవారిని అలంకరించారు. ఇక్కడ జక్కుల సురేష్ కుమార్ శిష్య బృందం ప్రదర్శించిన 'కూచిపూడి, జానపద నృత్యం ఆకట్టుకుంది.

సత్యనారాయణపురంలో..
సత్యనారాయణపురంలో కనకదుర్గ కొండపైన అమ్మవారు మహిషాసురమర్దని (మహార్నవమి) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

గవరపేటలో అన్న సమారాధన
కశింకోట: స్థానిక గవరపేటలో దుర్గాదేవి విగ్రహం మండపం వద్ద గౌరీ సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ నాయకుడు పెంటకోట రాము, జనసేన నాయకుడు దాసరి బాబు అమ్మవారిని దర్శించుకున్నారు.


నూకాంబిక ఆలయంలో కుంకుమపూజలు చేస్తున్న మహిళలు


కశింకోటలోని గవరపేటలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న భక్తులు


కన్యకాపరమేశ్వరి ఆలయంలో బిందెలపై కూచిపూడి నృత్య ప్రదర్శన

దుర్గమ్మ సేవలో భరత్‌కుమార్

అనకాపల్లి: పట్టణంతోపాటు మండలంలోని యువత దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తూ భక్తిప్రపత్తులు చాటుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. స్థానిక గవరపాలెంలో 80, 81 వార్డు పరిధిలో శివశక్తి ఫ్రెండ్, సతకంపట్టు కనకదుర్గమ్మ, బోయగూడెం, దాసరిగెడ్డ, రైల్వే స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన కనక దుర్గమ్మ మండపాలు, దేవాలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాలను ప్రారంభించారు. అంతకుముందు ఆలయ ప్రాంతాల కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ నాయకులు పల్లెల సాయికిరణ్, కాండ్రేగుల శ్యామ్, సకల సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.


నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్‌కు అమ్మవారి చిత్రపటం బహూకరణ

మహిషాసురమర్థినిగా..
కశింకోట: స్థానిక జాతీయ రహదారి వద్ద కనకదుర్గ ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్థినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో వ్యవస్థాపకుడు ఎన్. ప్రసాద్ బాబు కండువా వేసి అమ్మవారి చిత్ర పటాన్ని బహూకరించారు. వాటర్ వేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్య నాయుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాస రావు, యువజన నాయకుడు మలసాల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు. స్థానిక శివాలయంలో సర్వమంగళాంబను మహిషాసురమర్థినిగా అలంకరించి కుంకుమార్చనలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు.


బోయగూడెంలో కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న భరత్‌కుమార్, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు